www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

వైఎస్ఆర్

1 నుంచి వేసవి హంగామా

ప్రజాశక్తి-కడప అర్బన్: కడప బాలోత్సవ కమిటీ అధ్వర్యంలో వేసవి హంగామా పేరుతో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి సెలవుల్లో ఆరు నుంచి 10వ తరగతి చదువుచున్న పిల్లలతో నిర్వహించుటకు వినోద కార్యక్రమాలను రూపొందించిందని బాలోత్సవం జిల్లా గౌరవ అధ్యక్షులు నాగమునిరెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్ తెలిపారు. శనివారం మున్సిపల్ హైస్కూల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, పాటలు నేర్పించడం, సైన్స్ ప్రయోగాలు, కథలు, మ్యాజిక్ లాంటి అనేక కార్యక్రమాలతో పిల్లల అభిరుచిని, నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా బాలల మధ్య గడపడానికి బాలోత్సవం కమిటీ నిర్ణయించిందని చెప్పారు. మునిసిపల్ మెయిన్ స్కూల్లో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఇందులో చేరదలచిన వారు 9849496545, 9392661674 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా కోరారు.

రోజుకు @ 10 లక్షల యూనిట్లు

- అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- మార్చి నెలలోనే రూ.8 కోట్లు ఆదాయం
- రూ.8.5 కోట్లతో క్రమబద్ధీకరణ చర్యలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిపోతోంది. ప్రస్తుత వేసవి సీజన్లో వేడిగాలులు వీస్తుండడంతో ఏసిలు, కూలర్లు, ఫ్యాన్లు ఇతర శీతలీకరణ ఉపకరణాల వినియోగం పెరిగింది. ఫలితంగా గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. ఫలితంగా జిల్లాలో ప్రతి రోజూ 10 లక్షల యూనిట్ల మేర అదనపు డిమాండ్ ఏర్పడింది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. ఇందులోభాగంగా ట్రాన్స్కో గత మార్చి నెలలో రూ.ఎనిమిది కోట్ల మేర అధిక ఆదాయాన్ని ఆర్జించ డం గమనార్హం. జిల్లాలో 16.524 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం అవుతోంది. గతేడాది ఏప్రిల్ 24న 15.26 మిలియన్ యూనిట్లతో పోలిస్తే రూ.1.5 మిలియన్ యూనిట్లు డిమాండ్ పెరిగింది. జిల్లాలో ప్రతి రోజూ సుమారు 43.6 డిగ్రీలతో ఎండలు మండుతున్నాయి. ఫలితంగా రోజురోజుకూ హీట్ వేవ్స్ వీస్తున్నాయి. ఈమేరకు వాతావ రణశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు చేస్తోంది. ఈనేపథ్యంలో జిల్లాలోని 8.97,853 లక్షల విద్యుత్ వినియోగదా రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పలితంగా ఎసిలు, కూ లర్లు, ఫ్యాన్లు తదితర శీతలీకరణ ఉపకరణాల వినియోగంతో విద్యు త్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. ఫలితంగా రోజుకు రూ. 10 లక్షల యూనిట్ల చొప్పున అదనపు విద్యుత్ వినియోగం పెరి గింది. రాబోయే రోజుల్లో అదనంగా మరో రెండు మిలియన్ల యూ నిట్ల మేర విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందని అంచనా.

ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఈయేడాది మార్చి మాసంలోనే రూ.ఎనిమిది కోట్ల మేరకు ట్రాన్స్కోకు అధిక ఆదాయం లభించింది. మే నెలాఖరు నాటికి మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడంలో భాగంగా రూ.8.5 కోట్లతో క్రమబద్ధీకరణ పనులను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా జిల్లాలోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులి వెందుల డివిజన్ల కేంద్రాల్లో 240 ట్రాన్స్ఫార్మర్లు ఉన్నాయి. డివిజన్ కేంద్రాల పరిధిలో 11 పవర్స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఇందులో ఎనిమిది పవర్స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఇటువంటి ముందస్తు చర్యల నేపథ్యంలో భాగంగా ఎక్కడా విద్యుత్ అంతరా యం ఏర్పడకుండా చూడాలనే ఉద్దేశంతో ట్రాన్స్కో యంత్రాంగం ఎక్కడెక్కడ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయనే అంశాలపై దృష్టి సారించింది. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ మూల కారణాలను ఆరా తీస్తోంది. ఓవర్లోడ్, ఇతర బౌతిక సమస్యల కారణంగా విద్యు త్ అంతరాయాలు ఏర్పడుతున్నాయా లేదా అని పరిశీలిస్తోంది. సమ స్యను గుర్తించిన అనంతరం సత్వరమే పునరుద్ధరణ ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది.

ఉగ్రవాదాన్ని అరికట్టాలి

- దేశ శాంతి సామరస్యాన్ని కాపాడుతాం
- ప్రజా సంఘాల ఐక్యవేదిక భారీ ర్యాలీ

ప్రజాశక్తి-కడప అర్బన్

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద మారణ హోమానికి నిరసనగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున దేశ సమైక్యతను కాపాడుతామని, ముస్లిం, హిందూ, క్రైస్తవులు భాయిభాయి అని, ఉగ్రవాదాన్ని అరికట్టాలని, దేశ సమైక్యతను కాపాడాలని, ఉగ్రవాదులను అణి చివేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం ప్రజా ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ రాజా వెంగల్రెడ్డి మాట్లాడుతూ కడప నగరంలో పెద్ద ఎత్తున కులాలు, మతాలకు అతీతంగా పాల్గొనడం ప్రజల్లో మతసామరశ్యానికి ప్రతిరూపమన్నారు. ర్యాలీ అనంతరం ఐక్యవేదిక నాయకులు డాక్టర్ ఓబుల్రెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, చంద్రశేఖర్, రవిశంకర్రెడ్డి, బాబు భాయ్, జోగిరామిరెడ్డి, ముక్తియర్ అహ్మద్, రమణ మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని ముక్కలుగా చేయటానికి ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడడంలో తగినంత భద్రత లేకపోవడం అనేది వారికి అవకాశంగా లభిం చిందన్నారు. ఉగ్రవాదానికి కులం, మతం, ప్రాంతం ఉండదని, మతోన్మాదానికి కులం, మతం, ప్రాంతం ఉండదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఉగ్రవాదం వెనక ఎవరి పాత్ర ఉందో సమగ్ర రిపోర్టు తెప్పించుకొని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఉగ్రవాద దాడి వెనుక అనేక రకాల అనుమానాలు

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

తలెత్తుతున్నాయన్నారు. హోం శాఖ అమిత్షా ఆధ్వర్యంలో ఉందని తెలిపారు. ఈ ఉగ్రవాద కాడికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో పాల్గొని హిందూ, ముస్లిం, క్రైస్తవుల మతాలకు ఎలాంటి సంబంధం లేకపోయినా కొంతమంది స్వార్థపరులు హిందూ, ముస్లిం, క్రైస్తవుల ఐక్యత దెబ్బతీయటానికి ఇలాంటి సంఘటనలు వాడుకోవడం దుర్మార్గమైన చర్యన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, లక్ష్మీరాజా, బి.మనోహర్, నాగసుబ్బారెడ్డి, నాగమునిరెడ్డి, శంకర్, రవికుమార్, నాజర్, రామ్మోహన్, అలీఖాన్, శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అశోక్ కుమార్, భాస్కర్, శ్రీనివాసులు, వెంకట శివ, రామాంజనేయులురెడ్డి, లెనిన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, అన్వేష్, గోపాల్, గురప్ప, కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

మాట్లాడుతున్న సిఐటీయు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాల పెంచాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులను 60 సంవత్సరాలకే రిటైర్డ్ చేయడం దారుణమని పేర్కొన్నారు. 62కు పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, పెన్షన్ రూప్ రూ.10 వేలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్చార్జి బండి జకరయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఐద్వా నగర కార్యదర్శి జమీల, ఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, వ్య.కా.స. జిల్లా కార్యదర్శి అన్వేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, సిపిఎం నగర కమిటీ సభ్యులు కుమారస్వామిరెడ్డి ప్రసంగించారు. కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదనపు కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్లో పనిచేస్తున్న కార్మికులకు జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని చెప్పారు. 9 మంది డ్రైవర్లకు పెండింగ్లో ఉన్న రూ.24,500 ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సర్సింగ్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకోకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్, సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి సుంకర కిరణ్, నాయకులు శీను ఆదాం ఆనంద్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సత్తార్ కార్మికులు పాల్గొన్నారు.

జిఒ 35ను వెంటనే సవరించాలి

నిరసన తెలుపుతున్న పిఆర్ ఉద్యోగులు

ప్రజాశక్తి-కడప

పంచాయతీ రాజ్ శాఖలో పాలనా సంస్కరణ వల్ల పరిపాలన అధికారులకు తీరని అన్యాయం జరుగుతుందని ఎపి పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వర్రెడ్డి, సి.శ్రీనివాసులరెడ్డి అన్నారు. జిఒ నెంబర్ 35ను వెంటనే సవరించి మాకు రావాల్సిన 50 శాతం పదోన్నతి కోటాను పెంచాలని వారు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పాలనా సంస్కరణలను స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జిఒతో జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు ఎంపిడిఒ ఉద్యోగోన్నతి కోటాలో తీరని అన్యాయం జరిగిందన్నారు. గతంలో ఫీడర్ కేటగిరీని బట్టి ఎంపిడిఒ ఉద్యోగోన్నతిలో 34 శాతం కేటాయింపు జరిగిందన్నారు. ఇఒపిఆర్డిలకు 33 శాతం నేరుగా ఎంపిడిఒ నియామకానికి 30 శాతం, ఇతరులకు మూడు శాతం కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జిఒ నంబర్ 35ను సవరించి మాకు రావాల్సిన 50 శాతం పదోన్నతి కోటాను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు విజయ భాస్కర్రెడ్డి, రాజేంద్రప్రసాద్, మధుసూదన్, ప్రభాకర్రెడ్డి, భాస్కర్రెడ్డి, ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

మేడేను జయప్రదం చేయండి : సిఐటీయు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా మే ఒకటో తేదీ నిర్వహించే మేడే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులు, నాయకులు 36 మండలాల్లో జెండాలు ఆవిష్కరించాలని తెలిపారు. ర్యాలీ, సభలు నిర్వహించాలని చెప్పారు. కార్మికవాడల్లో పట్టణాల్లో, నివాస ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8 గంటల పనిదినాన్ని కాలరాయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఉన్న ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల కార్యక్రమాలకు విభజించారని గుర్తు చేశారు. ఈ హక్కును కాలరాయడం దుర్మార్గమని చెప్పారు. 12 గంటల పని దినాన్ని అమలు చేయడానికి కార్మిక చట్టాలను రద్దుచేసి 4 కోడ్స్ తీసుకురావడం దారుణమని తెలిపారు. మే 20న లేబర్ కోడ్స్కు వ్యతిరేకంగా సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు గోపి, పవన్, కొండయ్య పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-కడప అర్బన్

నకాష్లో ఉన్న ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో 100 ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు తెచ్చుకున్న ముగ్గురికి నగదు బహుమతి అందజేసినట్లు టిడిపి నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు శకీరా బేగంఖాద్రి, చైర్మన్ గౌస్బాషా సమక్షంలో బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో స్కూల్ మొదటి స్థానంలో నిలిచిన షేక్. రూబియాకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ సుభానికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలచిన షేక్ సల్మాన్కు రూ.3 వేలు అందించినట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నగదు బహుమతి అందజేయడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జమీల్, గౌస్ బాషా, నాయబ్ రసూల్, స్వాతి, కళావతి, రవిశంకర్, చాంద్ బాషా, టిడిపి నాయకులు జావిద్ బాష, షేక్. వాజిద్, రాఘవ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న పఠాన్ మన్సూర్ అలీఖాన్

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 27వ తేదీన ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతధంగా పనిచేస్తాయని విద్యుత్ ఎస్ఇ రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డిఎస్సి అభ్యర్థులకు న్యాయం చేయండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరుద్యోగులు ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న మెగా డిఎస్సి నోటిఫికేషన్లో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణమే కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసిలను డిఎస్సికి అనర్హులు చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో 45, 50 శాతం ఉండాలి అనే నిబంధనను తొలగించి అందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సైతం 40 శాతానికి అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. సిలబస్ విస్తృతి రీత్యా అభ్యర్థులకు ప్రిపరేషన్కు 90 రోజులు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 55 పుస్తకాలు రివిజన్ చేసుకోడానికి కూడా ప్రభుత్వం ఇచ్చిన సమయం సరిపోవడం లేదన్నారు. డిఎస్సి పరీక్షలు సందర్భంగానే ఎపిపిఎస్సి డిఎల్, జెఎల్ తదితర పరీక్షలు ఉన్నందున అభ్యర్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఓకే జిల్లాకు ఓకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషనైలేజేషన్ వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ఏడు సంవత్సరాలుగా డిఎస్సి నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి 47కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగంతో మగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు అనాలోచితం విధానాలు వల్ల ఎక్కువ మందిని డిఎస్సి అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన డిఎస్సికి దరఖాస్తు చేసుకోవడానికి చేసుకోడానికి ఇచ్చిన వెబ్ సైట్స్, టోల్ ఫ్రీ నంబర్లు ఎమి పని చేయడం లేదన్నారు. అనేక మందికి ఎడిట్ ఆప్షన్, సబ్జెక్టు చూపించడం లేదని పేర్కొన్నారు. తక్షణమే సమ స్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయా లని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది, పథకాల విషయంలో నిధుల కొరత ఉందని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి. ఎన్నికలలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం,18 సంవత్సరాలు వయసు పైబడిన వారికి నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిందన్నారు. ఇలాంటి పథకాల ప్రకటించి మధ్యతరగతి ప్రజల ఓట్లను మభ్యపెట్టి నిధులు లేవు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు, ప్రజలు అర్థం చేసుకోవాలి అనే మోసపూరిత మాటలు చెప్పడం కూటమి ప్రభుత్వంకు అలవాటన్నారు. ఇలాగే కాలయాపన చేస్తూ ఉంటే ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. నూతన రేషన్ కార్డుల ప్రక్రియ విషయంలో నిర్లక్ష్యం చేస్తూ తమకేమి పట్టినట్లు జాప్యం చేస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం హాస్యాస్పదమన్నారు.

గణిత విద్యాబోధన సామగ్రి ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి హిదాయాతుల్లా రూట సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన గణిత విద్యా బోధన సామగ్రిని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా బోధన సామగ్రి ఆకర్షణీయంగా, సమగ్ర విషయ భరితంగా ఉందని కొనియాడారు. మైనారిటీ విద్యార్థులు ఈ సామాగ్రిని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం మైనారిటీలకు సముచిత స్థానం ఇస్తుందని వారి విద్యా ఉపాధి మరియు శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని తెలి పారు. ఉచిత డిఎస్సి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రూట జిల్లా శాఖా ఆధ్వర్యంలో నూతన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి హిదాయాతుల్లాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర డైరి కమిటీ చైర్మన్ హాజి అబ్దుల్ హకీమ్, కో-చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ ఆహ్మద్, రాష్ట్ర సమన్వయకర్త అయూబ్, ఉపాధ్యాయులు ఖాజా పీర్, కటిక జుబేర్ పాల్గొన్నారు.

రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పాలి

ప్రజాశక్తి-అట్లూరు: డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.చాంద్బాషా, మండల కార్యదర్శి ఇ.రమణయ్య పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిరుపేదల ఇళ్లను కూల్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సిపిఎం ప్రజా పక్షాన మాత్రమే పోరాడుతుందని, ప్రజలకు అన్యాయం చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా నిలదీయగల పార్టీ అని గుర్తు చేశారు. శ్రీనివాసరావుకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రవిచంద్ర, గోపయ్య, గోపయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-కడప అర్బన్

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబల్లి అశోక్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని మాల ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నిత్య ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలకు తీవ్రమైన అన్యాయం కూటమి ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. మాల సామాజిక వర్గం, మాల ప్రజాసంఘాల నాయకులు, విద్యా, ఉద్యోగస్తులు బాధ్యతగా ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా మాలల జనాభాను తక్కువగా చూపి రిజర్వేషన్ శాతాన్ని తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కారంచేడులో మాదిగల మీద దాడి జరిగితే వారికి అండగా నిలిచి హక్కున చేర్చుకుని న్యాయం జరిగే వరకూ పోరాటం చేసిన వారు మాలలని మందకృష్ణ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ వర్గీకరణ చేయకపోతే ఎపి, తెలంగాణలో ఎందుకు చేశాయో మాల మాదిగలు గుర్తుంచుకోవాలన్నారు. మన మధ్య చిచ్చు పెట్టడం తప్ప ఇంకొకటి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు స్వర్ణ నరసింహమూర్తి, మహిళా నాయకులు సునీత, గిడియాన్, మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి లెనిన్ ప్రసాద్, బండారు ఓబులేసు, కార్పొరేషన్ సూపర్నెంట్ గురప్ప, యువజన నాయకులు చంద్ర, పవన్ కుమార్, శీను, విక్టరీ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న నాయకులు

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారమవుతుందని ఫ్యాక్షన్ జోన్ సిఐ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం దేశ భవిష్యత్తును కృంగదీసే మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం అంశంపై స్విస్ట్ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడి సమాజం నుంచి దూరమవుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కళాశాల సమీప ప్రాంతా

ప్రజలకు పలు సూచనలు చేస్తున్న ఎస్ఐ సుబ్బారావు

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పెద్దముడియం

వ్యసనాలకు బానిసలై అనేక రకాల మార్గాల్లో దొంగతనాలకు పాల్పడుతూ యువకులు దొంగలుగా మారుతూ, వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్ఐ సుబ్బారావు అన్నారు. రూరల్ సిఐ గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎస్ఐ తన సిబ్బందితో పెద్ద పసుపులలో నాకాబంది చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో స్థానికులతో సమావేశం నిర్వహించి డబ్బు, బంగారు దొంగలించే వారి నుండి ప్రజలు, ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సరైన పత్రాలులేని 12 ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్ కు తరలించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నాకాబందీలో పట్టుబడ్డ వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

రామేశ్వరరెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న పి.రామేశ్వరరెడ్డికి ద్రవిడయన్ యూనివర్సిటీ, కుప్పం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ బిఆర్ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో విజయనగర సామ్రాజ్యం కింద దక్షిణ భారతదేశంలో సామాజిక ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి అనే అంశంపై పరిశోధనకు పిహెచ్‌డి అవార్డు ప్రదానం చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మైదుకూరు కౌన్సిలర్ మృతి

- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఖాదర్‌బాషా(ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని రేకులకుంట సమీపంలో జెడ్.కొత్తపల్లి వద్ద మైదుకూరు-బద్వేల్ జాతీయ ప్రధాన రహదారిపై లారీ, కారుని ఢీకొని సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుడు మైదుకూరు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ ఖాదర్‌బాషా. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మసాగర్‌లో పడి మరో వ్యక్తి..

మృతి చెందిన వీర బ్రహ్మచారి

బ్రహ్మంసాగర్‌లో పడి శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని నీటిలో ఉన్న గుర్తు తెలి యని మృతదేహాన్ని బయటకు తీశారు. సోషల్ మాధ్యమాల్లో మృతుడి వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాల పోలీసులు సూచించారు. తద్వారా మృతి చెందిన వ్యక్తి విజయవాడ దగ్గర మైలవరానికి చెందిన వీర బ్రహ్మచారి(40)గా పోలీసులు గుర్తించారు. మృతిపై విచారిస్తున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి..

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై చాపాడు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామనూరు సుభాష్(17) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. దువ్వూరు మండలం కృష్ణంపల్లెకు చెందిన కామనూరు సుభాష్ చాపాడు మండల పరిధిలోని సిబిఐటి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు బైక్‌పై వెళుతుండగా చాపాడు సమీపంలో గేదె అడ్డు తగలడంతో అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయంతో అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలో వెనుక వైపు ఉన్న చియ్యాపాడు గ్రామానికి చెందిన సృతికుమార్ అనే విద్యార్థికి బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు ..

ప్రజాశక్తి - లింగాల

సాగులో ఉన్న చీనీ తోటకు సాగునీరు అందించే క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై నల్లపురెడ్డి మేఘనాథరెడ్డి (43) అనే రైతు మృతి చెందాడు. మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు కథనం మేరకు.. సింహాద్రిపురం మండలం బిదనంచర్ల గ్రామంలో మేఘనాథరెడ్డి కుటుంబ సభ్యులతో జీవిస్తూ.. లింగాల మండలం వెలిగండ్ల గ్రామంలో తన రెండున్నర ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నాడు. రోజులాగే పంట పొలాన్ని చూసుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చీనీ చెట్లకు నీరందించేందుకు స్టార్టర్ స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చీకటి పడుతున్నా మేఘనాథరెడ్డి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పొలం వద్దకు వెళ్లి చూడగా కూప్ప కూలిపడిన భర్తను చూసి గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్న రైతులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద కుమారుడు, కుమార్తె, భార్య విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ప్రజాశక్తి - తొండూరు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ఇనగలూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఇనగలూరు గ్రామానికి చెందిన బొగ్గుల పెద్ద గంగిరెడ్డి (58)ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మృతుడు దేవిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి

పట్టణంలోని నారాయణ పాఠశాల సమీపంలో దేవిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి (55) అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మావతి, కుమారుడు కార్తీక్‌రెడ్డి, కుమార్తె దీపక్‌రెడ్డి ఉన్నారు. ఇటీవల నుంచి విజయభాస్కర్ రెడ్డి, పద్మావతి కుటుంబ సమస్యల వల్ల వేర్వేరుగా నివాస ఉంటున్నారు. భార్య పద్మావతి కుమారుడు కార్తీక్‌రెడ్డితో కలిసి ముద్దనూరు రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ భాస్కర్‌రెడ్డికి బీపీ, షుగర్ ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీనికితోడు ఫ్యామిలీ సమస్యలు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో విజయభాస్కర్ రెడ్డి మంచంపై నుంచి పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని విజయభాస్కర్ రెడ్డి మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

హిమకుంట్లలో బిసి హాస్టల్ పునఃప్రారంభం

5వ తరగతి నుంచి 10 వరకు వసతి - ఈవిద్యా సంవత్సరం నుంచి అమలు

బిసి హాస్టల్ నూతన భవనం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్లలో బిసి వెల్ఫేర్ హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో మండల కేంద్రమైన సింహాద్రిపురంలో బీసీ, ఎస్సీ హాస్టల్స్ ఉండేవి. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా వాటిని ప్రభుత్వం మూసివేసింది. ఈ కారణంగా బీసీ, ఎస్సీ పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హిమకుంట్లలో బీసీ హాస్టల్ ఏర్పాటు ఆవశ్యకత ఉందని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. జిల్లా అధికారుల సూచన మేరకు స్థానిక నాయకులు, గ్రామస్తులు రూ.10 లక్షలు ఖర్చు చేసి పిల్లలకు బాత్ రూమ్స్, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన చవ్వా వెంకటసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వారిపిల్లలు చవ్వా లక్ష్మి సుధా, చవ్వా సుధీర్‌రెడ్డి కిచెన్ షెడ్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. స్టడీ నిమిత్తం మంచి స్థలం, హాస్టల్ భవనాలను, వసతులను పరిశీలించి ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు..

ఈ విద్యా సంవత్సరం నుంచి 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు కానుందని ఎబిసి డబ్ల్యూఒ (పులివెందుల) నాగేంద్ర రాజు తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్ ఏర్పాటుకు గ్రామస్తుల సహకారం మరవలేనిదన్నారు.

ఏర్పాటు చేసిన బాత్‌రూమ్స్

గొర్రెల పెంపకం.. నిరుద్యోగులు, రైతులకు వరం

ఎన్ఎల్ఎం పథకం ద్వారా రూ.కోటి వరకు 50 శాతం రాయితీ రుణం - వచ్చే ఏడాది మార్చి వరకే అవకాశం

వీరపునాయునిపల్లెలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గొర్రెల పెంపక కేంద్రం పట్ల రైతులు అత్యధికంగా ఆసక్తి చూపుతున్నారని స్థానిక పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మునెయ్య తెలిపారు. ఆ మేరకు శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎల్ఎం (నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్) పథకం ద్వారా గొర్రెల పెంపకం, ఉత్పత్తి కేంద్రం నిర్మాణానికి 50 శాతం సబ్సిడీతో రూ.కోటి వరకు రుణం పొందవచ్చునని చెప్పారు. ఈ పథకంలో 100 గొర్రెలు ఐదు పొట్టేళ్లు, కేంద్రం నిర్మాణానికి రెండు ఎకరాల భూమి ఉండాలన్నారు. ఇలా 300 గొర్రెలైతే 15 పొట్టేళ్లు, 500 గొర్రెలకు అయితే 25 పొట్టేళ్లు ఉండాలన్నారు. ఐదు ఎకరాల భూమి ఉండాలని సూచించారు. వారు ఏర్పాటు చేసే కేంద్రాన్ని బట్టి భూమి ఉండాలని తెలిపారు. సొంత భూమి లేని వారు అయిదేళ్ల లీజు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇటీవల వీరపునాయిని పల్లెలో ఆరు కేంద్రాలు, ఎర్రగుంట్లలో ఒకటి మంజూరైనట్లు తెలిపారు. వివిఎన్ పల్లెలో రెండు ప్రారంభమై రాయితీ రూ.50 లక్షలు పొందారని చెప్పారు. ఇంకొకటి నిర్మాణ దశలో ఉందన్నారు. షెడ్డు పూర్తయిందని, దీనికి రూ.25 లక్షలు రాయితీ వచ్చిందన్నారు. గొర్లను పూర్తిగా ఏర్పాటు చేసుకున్నాక ఇంకో రూ.25 లక్షలు రాయితీ వారి ఖాతాలో పడనుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు, పశుసంవర్ధక రైతుల మెరుగైన జీవనోపాధికి ఈ కేంద్ర ప్రభుత్వ పథకం రూపొందించారన్నారు. గొర్రెలకు మంచి డిమాండ్ ఉందని, కిలో మాంసం మార్కెట్ ధర రూ.800 పలుకుతోందని చెప్పారు. రైతులకు మంచి లాభాలు వస్తాయని ఆయన వివరించారు. నాణ్యమైన దాణ వాడాలని, వేసవిలో పచ్చగడ్డికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఒక్కో గొర్రెకు రూ.54 బీమా చేయించుకోవాలన్నారు. తద్వారా ఆ గొర్రె చనిపోతే రూ.6000 వస్తాయని చెప్పారు. దేశి వెరైటీ ఫాల్ట్ ఫెర్మ్(నాటు కోళ్ల లాగా ఉండే రంగు కోళ్లు పెంపకం) కోసం ఎన్ఎల్ఎం పథకం ద్వారా రుణం పొందవచ్చు అన్నారు. 2000 కోళ్లు పెంచేందుకు రూ.50 లక్షలు రుణం ఇస్తారని తెలిపారు. ఇందులో 50 శాతం రాయితీ వస్తుందని వివరించారు. గుడ్లు పొదుగు పెట్టేందుకు మిషన్ వస్తుందని తెలిపారు. ఇందులో మూడు విధాల షెడ్లు అవసరమని చెప్పారు. కోడి పిల్లలను నాలుగు నెలలు పెంచడం ద్వారా రెండున్నర కిలోల నుంచి మూడు కిలోల వరకు బరువు పెరుగుతాయన్నారు. ఇందుకు ఖర్చు సుమారు రూ.250 వస్తుందన్నారు. అయితే మార్కెట్లో ఈ కోళ్ల కిలో మాంసం ధర రూ.500 ఉందని, మంచి లాభాలు వస్తాయని ఆయన వివరించారు. ఎన్ఎల్ఎం పథకం ద్వారా పందుల పెంపకం యూనిట్‌కు కూడా 50రాయితీ రుణం పొందవచ్చని తెలిపారు. 2026 మార్చిలో ఎన్ఎల్ఎం పథకం ముగిస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు, నిరుద్యోగులు త్వరగా ఏర్పాటు చేసుకోవాలని మునెయ్య సూచించారు.

12 కేసుల్లో ఆరుగురు దొంగలు అరెస్టు

- 20 తులాల బంగారం, 248 గ్రాముల వెండి స్వాధీనం

నిందితులు, రికవరీ సొమ్మును వివరిస్తున్న డిఎస్పి మురళి నాయక్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జిల్లావ్యాప్తంగా చోరీలు చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 తులాల బంగారం, 248 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఆమేరకు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పులివెందుల డిఎస్పి మురళి నాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఉలిమెల్ల రింగ్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా దొంగతనాల కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురు రెండు మోటర్ సైకిళ్లపై వెళుతుండగా అర్జన్ సీఐ చాంద్ బాషా సిబ్బందితో కలిసి వారిని అరెస్టు చేశారన్నారు. జిల్లాలో 12 కేసుల్లో వల్లెపు నవీన్, కత్తులూరు గణేష్, మంజుల గంగాధర్, కొమ్మెర రాజశేఖర్, వల్లెపు గంగాధర్, వల్లెపు వెంకటచంద్ర, మహేష్ నిందితులుగా ఉన్నారన్నారు. వీరు పులివెందుల, ఎర్రగుంట్ల, కలమల్ల, బద్వేలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను అనువుగా చూసుకొని దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. బంగారు, వెండి ఆభరణాలతోపాటు రెండు మోటర్ సైకిళ్లు, ఒక టివిని రికవరీ చేశామన్నారు. దొంగలను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి, నూర్‌బాషా, రామ్ రమేష్, ఎల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం సిబ్బందిని ఎస్పి అభినందించారు. వీరికి త్వరలో రివార్డ్ మనీని ఎస్పి అశోక్ కుమార్ అందజేయనున్నట్లు డిఎస్పి తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పనికి రేటు.. విద్యుత్ శాఖలో అక్రమ వసూళ్లు

- అదనంగా మూల్యం చెల్లించకపోతే ట్రాన్స్‌ఫార్మర్ కష్టమే

ప్రజాశక్తి - వేముల

వేముల విద్యుత్ కార్యాలయం అక్రమ వసూళ్లకు నిలయంగా మారింది. విధుల్లో ఉన్న అధికారులు కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు కమీషన్లు ఇస్తేనే తమ అవసరాలు తీరుతున్నాయని రైతులు, ప్రజల ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రతి పనికి రేటు నిర్ణయించి వసూళ్ల చేస్తున్నారని పేర్కొంటున్నారు. రైతుల నుంచి అదనంగా డబ్బులు రాబట్టేం దుకు కిందిస్థాయి సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే ఏవో కారణాలు చెప్పి కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పుతున్నారని రైతులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖలో ప్రతినెల లక్షల్లో జేతాలు తీసుకుంటున్నా.. లంచాలు లేకుండా కొంతమంది అధికారులు ఏ పని చేయడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొత్తలైన్, కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వేయా లన్నా ప్రతి పనికి ముందుగా అధికారులు ఎస్టిమేషన్లు వేయాలి. ఈ ఎస్టిమేషన్ల ఆధారంగా వినియోగదారులు విద్యుత్ సంస్థకు డబ్బులు చెల్లించి పనులు చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ ఎస్టిమేషన్లు వేసేటప్పుడే కొంతమంది అధికారులు అక్రమాలకు తెరలేపుతున్నారు. ఎస్టిమేషన్లు వేసే ముందు అడిగినంత చెల్లిస్తే ఒకలా, డబ్బులివ్వకపోతే మరోలా రూపొందిస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. త్రీ ఫేజ్ కనెక్షన్ తీసుకునేందుకు మరో రేట్, మీటర్ చేంజ్ చేసుకోవాలన్నా ఇంకోరేట్.. ఇలా ఒక్కో పనికి ఒక్కో రేట్ ఫిక్స్‌చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్ కార్యాలయం వద్దకు వస్తే రైతు అవసరాలను ఆసరాగా తీసుకొని ఇష్టానుసారంగా మినిమం రూ.1000 నుంచి రూ.4000 వసూలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. శనివారం నారేపల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ వచ్చినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. రైతు ట్రాక్టర్ తీసుకొని వేముల సబ్ స్టేషన్ వద్దకు రాగా అక్కడ అధికారులకు మామూలు ఇవ్వలేదనే కారణంతో ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. ఆ రైతు విద్యుత్ సిబ్బందిపై గొడవగా దిగడంతో చివరకు ఆ రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చి పంపించారు. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మట్టి పాత్రలు బహు ప్రయోజనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సగటు మనిషి జీవన కుటుంబానికి మట్టి పాత్రలు బహుళ ప్రయోజనాలు కలిగిస్తాయి. ప్రాచీన కాలం నుంచి నేటి నవీన యుగం వరకు మట్టి పాత్రల వినియోగానికే అధిక ప్రాధాన్యతనిచ్చారు. తినే తిండి నుంచి వాడే పాత్ర వరకు మట్టితో తయారు చేసిన పాత్రలోనే వినియోగించేవారు. నేటికీ వాటి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నేటికీ సమాజంలో పలు కార్యక్రమాలకు మట్టి పాత్రలను వినియోగిస్తున్నారు. కాల గమనంలో సిల్వర్ పాత్రలు మార్కెట్లోకి రావడంతో ఆదరణ తగ్గిందని చెప్పవచ్చు. వీటిపై ఆధారపడి జీవించే పలు శ్రామిక కుటుంబాలు బతుకు దెరువును కోల్పోయాయని చెప్పవచ్చు. వేసవిలో మట్టి పాత్రలను పేదోడి ఫ్రిజ్‌లా పిలుస్తారు. వేసవి రావడంతో మట్టి పాత్రలు మార్కెట్లోకి వచ్చేశాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రతి ఒక్కరూ మట్టి పాత్రలను వినియోగించేవారు. మట్టితో తయారైన పాత్రల ఉపయోగం ఎంతో మంచిదని చెబుతున్నారు. ఈ మట్టి పాత్రలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారు ప్రత్యేకించి తయారు చేస్తారు. వీటిని అందంగా 10 కాలాలపాటు పదిలంగా ఉండేందుకు తయారు చేయడంలో ఎంతో పేరు ఉంది. బానలు, కుండలు, కడవలు ఇలా వివిధ రకాల పాత్రలు ఎంతో నైపుణ్యంతో తయారు చేస్తారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు మట్టి పాత్ర తయారు చేయడంలో పేరుగాంచాయి. సాంకేతిక పరి జ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోవడంతో మట్టి పాత్రల వినియోగం చాలా వరకు తగ్గింది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో మార్కెట్లో వివిధ రకాల సామగ్రి అందుబాటులోకి రావడంతో మట్టిపాత్రలకు గిరాకీ తగ్గిందనే వాదన కూడా వినవస్తోంది. దీంతో వీటిపై ఆధారపడిన కుటుంబాలకు బతుకుదెరువు కరువైంది. కుల వృత్తికి స్వస్తిబలికి బతుకుదెరువు కోసం ఇతర మార్గాలను అన్వేషించాల్సి వచ్చిందని శ్రామికులు చెబుతున్నారు. ప్రాచీన కాలం నుంచి మట్టి పాత్రలకు విశేష ఆదరణ ఉంది. ముఖ్యంగా వేసవిలో తాగునీటి కోసం మట్టి పాత్రలోనే వినియోగించేవారు. గతంలో బాటసారుల దాహార్తి కోసం గ్రామ శివారులో చెట్టుకు బానలను ఏర్పాటు చేసేవారు. మట్టిపాత్రలో నీటిని సేవించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని పలువురు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో యాంత్రిక జీవనం సాగిస్తున్న సగటు మనిషి ప్రాచీన కాలం నాటి మట్టి పాత్రలను నేటికీ వినియోగిస్తూ ఆదరిస్తున్నారు.

మాక్‌డ్రిల్‌లో అధికారులు

యుసిఐఎల్‌లో అక్టోపస్ బలగాల మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - వేముల

ఎం.తుమ్మలపల్లె గ్రామా పంచాయతీ పరిధిలోని యురేనియం కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో శనివారం ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజేపి) ఆదేశాల మేరకు గురు, శుక్ర, శనివారాల్లో ఆక్టోపస్ డిఎస్పి రాంబాబు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శివాజీ, సుబ్రమణ్యేశ్వర రెడ్డి, ఆరోస్ నాయక్, తమ కమాండోస్ బృందంతో నిర్వహించారు. ప్లాంట్‌లోకి ఉగ్రవాదులు చొరబడి ఉద్యోగులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపినప్పుడు వారిని కాపాడిన తీరును ప్రదర్శించారు. కార్యక్రమంలో యుసిఐఎల్ జిఎం సుమన్ సర్కార్, ఎస్పీఎఫ్ సిఐ బాషా, ఆర్కేవ్యాలీ సిఐ ఉలసయ్య, వేముల ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఫైర్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి పాలనలో అప్పటి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధి మరిచి వసరులు సంపద దోచుకుని, ప్రజలను మోసం చేశారని ఎంపిటిసి లక్ష్మీ కాంతమ్మ ఆరోపించారు. శనివారం తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 5 ఏళ్ల వైసిపి పాలనలో సుధీర్‌రెడ్డి నియోజకవర్గంలోని సిమెంట్ కర్మాగారాలు, గనుల నుండి నెలకు దాదాపు రూ.2కోట్లు మామూళ్లు వసూలు చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఆది నారాయణరెడ్డి హయాంలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వైసిపి ప్రభుత్వంలో సుధీర్‌రెడ్డి గండికోట నిర్వాసితులకు కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలిచి కార్యకర్తలకు దోచిపెట్టారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజుల సురేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళలు

మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - వేముల

స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శనివారం మండల మహిళా సమైక్య కార్యవర్గ సమావేశాన్ని మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. మండల సమాఖ్య కార్యదర్శిగా పనిచేస్తూ అకాల మరణం పొందిన కుమారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం తప్పకుండా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, సభ్యత్వం వాటాధనం, పొదుపులు 100 శాతం చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. గ్రామ సమాఖ్య మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం సభ్యులకు ఈశ్రమ్ కార్డు నమోదు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను అవగాహన కల్పించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన గ్రామ సమాఖ్య సమాచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు నాగేశ్వరి, గంగరాజు, హరికృష్ణ, జయపాల్, మండలం మహిళా సమాఖ్య అకౌంటెంట్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

- వైసిపి ప్రచార రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

క్షేత్రస్థాయిలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్‌బాషా పేర్కొన్నారు. వేంపల్లెకు చెందిన నిసార్ బాషాను వైసిసి ప్రచార రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. గతంలో మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉండి ఆయన వైసిపి బలోపేతానికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో నిసార్ సేవలను గుర్తించి పార్టీ రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులను కేంద్ర కార్యాలయ అందజేసింది. ఈ సందర్భంగా నిసార్ బాషాకు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ గురువు జడ్‌పిటిసి సభ్యుడు ఎం.రవి కుమార